www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 20 డిసెంబరు 2022

5

ఏలూరు



మెరుగైన సేవలే సుపరిపాలన లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే సుపరిపాలన వారోత్సవాల ముఖ్యోద్దేశమని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరంలో సుపరిపాలన వారోత్సవాల ప్రారంభం సందర్భంగా ఆయా శాఖల అధికారులతో సుపరిపాలన అందించడంపై ఆయన సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో సేవలను మరింత మెరుగు పరచడమే ధ్యేయంగా దేశవ్యాప్తంగా సుపరిపాలన వారోత్సవాలను ఈనెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, డిఆర్డిఎ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్డిఒ కె.పెంచలకిషోర్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శ్మశానాల్లోనూ.. వదలరా..!



ఏలూరు కార్పొరేషన్‌లో అంత్యక్రియలకు కనీస ఛార్జీ రూ.5 వేలుగా నిర్ణయం

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు, ప్రజలు

ఇదే అదునుగా మత చిచ్చు రేపేందుకు మతతత్వ శక్తుల కుటిలయత్నాలు

'ఆస్తి పన్ను పెంపు.. ఆపై చెత్త పన్ను వసూలు..' ఇలా పట్టణ ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా భారాల మోత మోగుతోంది. అయితే ఏలూరులోని మున్సిపల్ కార్పొరేషన్ ఒకడుగు ముందుకేసి 'వదలా.. బొమ్మాళీ..' తరహాలో శ్మశానాల్లో కనీస ఛార్జీలు పేరిట వసూళ్ల పర్వానికి తెరలేపుతూ తీర్మానించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఇదే సమయంలో ప్రతిదీ వివాదాస్పదం చేసేందుకు 'గుంటకాడ నక్కల్లా' కాచుకుని కూర్చునే మతతత్వ శక్తులు భారాలపై పోరు కాకుండా జనం మధ్య చీలికలు తెచ్చేలా రెచ్చగొట్టే చర్యలకు దిగుతుండటం కలవరం సృష్టిస్తోంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇటీవల ఏలూరు నగర పరిధిలో శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలు చేసేవారు రూ.ఐదు వేలు కనీసంగా చెల్లించాలని కార్పొరేషన్ పాలకవర్గం తీర్మానం చేసింది. దీన్ని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, టిడిపి, జనసేన, న్యూడెమోక్రసీ ఇలా అన్ని పార్టీలూ తీవ్రంగా ఖండించాయి. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 17 శ్మశాన వాటికలు ఉన్నాయి. ఇక్కడ ప్రతిరోజూ పదుల సంఖ్యలో దహన సంస్కారాలు జరుగుతుంటాయి. వీటికి ఒక్కో శ్మశాన వాటికలో ఒక్కోవిధంగా ఖర్చవుతోంది. దహన సంస్కారాలు అనేవి ఆయా కుటుంబాల వ్యక్తిగత అభిమతం బట్టి జరుగుతుంటాయి. వాస్తవానికి ప్రజలకు ఖర్చు లేకుండా విద్యుత్ శ్మశాన వాటికలను నగరంలో ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. దాన్ని పట్టించుకోని నగర పాలకులు వసూళ్లపర్వంకు ఆమోదం తెలపడం చర్చనీయాంశమైంది. దహన సంస్కారాలకు పుల్లలు, ఇతర ఖర్చులు అన్నీ కలిపి దాదాపు రూ.పది వేలు వరకూ అవుతుందని, దాన్ని తగ్గించే ప్రయత్నంలో భాగంగానే రూ.ఐదు వేలు చెల్లించాలని తీర్మానించినట్లు చెబుతుండటం విస్మయం కల్గిస్తోంది. ఈ సొమ్ము కాటికాపరుల కోసం వినియోగిస్తామనడం మరింత విడ్డూరంగా ఉంది. రాష్ట్రంలో ఎక్కడా శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలకు ధరలు నిర్ణయించడం అనేది లేదు. దానికి భిన్నంగా ఏలూరు కార్పొరేషన్ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలూ ముక్తకంఠంతో ఖండించాయి. దహన సంస్కారాలు అనేవి ఎవరి స్తోమతకు తగ్గినట్లుగా వారు చేసుకుంటారే తప్ప కార్పొరేషన్ ప్రత్యేకంగా ధర నిర్ణయించాల్సిన అవసరమేమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. ప్రజలకు మేలు చేయాలంటే కాటికాపరులను కార్పొరేషన్ సిబ్బందిగా పరిగణించి వేతనాలు అందిస్తే బాగుంటుంది. అలాకాకుండా జనాల నుంచి సొమ్ములు వసూలు చేయాలని చూడటం అత్యంత దుర్మార్గమని చెప్పొచ్చు. దహన సంస్కారాల ఖర్చును అధికారికంగా వసూలు చేస్తే అది ఇంతటితో ఆగదు. ప్రతియేటా పెరుగుతూ ప్రజలకు భారంగా మారే పరిస్థితి ఏర్పడనుంది.

ఇదే అదునుగా మతతత్వ శక్తుల కుటిలయత్నాలు

శ్మశానాల్లో వసూళ్ల నిర్ణయాన్ని అంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అయితే కొన్ని మతతత్వ శక్తులు సమస్య పరిష్కారంపై కాకుండా జనం మధ్య చీలిక తెచ్చేలా మతచిచ్చు రేపేందుకు ప్రయత్నిస్తుండటం కలవరం సృష్టిస్తోంది. హిందూ శ్మశాన వాటికలపై దాడి అంటూ రెచ్చగొట్టేవిధంగా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. దీన్ని ఖండించి, సమస్య తీవ్రరూపందాల్చక ముందే పాలకులు చర్యలు చేపట్టాల్సి ఉంది. కార్పొరేషన్ పాలకులు తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. తద్వారా అటు ప్రజల మన్ననలు చూరగొనడంతోపాటు మతతత్వశక్తుల కుట్రలకు చెక్ పెట్టినట్లవుతుంది. లేనిపక్షంలో అధికారపక్షమైన వైసిపి మత విద్వేషాలకు కారణమవుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నేతలు

శ్మశాన వాటికల్లో ఫీజు రద్దు చేయాలి

అఖిలపక్ష సమావేశం డిమాండ్

జిల్లా అధికారులకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో శ్మశాన వాటికల్లో రూ.ఐదు వేలు ఫీజు వసూలు చేయాలనే తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం ఉదయం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ప్రజలపై యూజర్ ఛార్జీలు విధిస్తే బ్యాంకు రుణాలకు అనుమతులిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలకు షరతు పెట్టిందన్నారు. కేంద్రం షరతులను వైసిపి తూచ తప్పకుండా అమలు చేస్తుందని విమర్శించారు. ఇప్పటికే కరెంట్ ఛార్జీలు, చెత్త పన్ను ఆ విధంగానే పెరిగాయన్నారు. ఇప్పుడు ఎక్కడా లేనివిధంగా శ్మశానంలో ఛార్జీల వసూలు ప్రజలను పీక్కు తినడమేనని వ్యాఖ్యానించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు ప్రసాద్, టిడిపి మాజీ కార్పొరేటర్ బొరోతు బాలాజీ, మాజీ నగర అధ్యక్షులు కొల్లేపల్లి రాజు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, జనసేన నాయకులు ఒ.శ్రవణ్‌కుమార్, నగర అధ్యక్షులు కాశీ నరేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం శ్మశాన వాటికలో దహన కార్యక్రమాలకు రూ.ఐదు వేలు ఫీజు వసూలు చేయాలని తీర్మానించడాన్ని తప్పుబట్టారు. కాటికాపర్ల జీవన భృతి నిమిత్తం ఈ వసూళ్లని వైసిపి కార్పొరేటర్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. కాటికాపర్ల సంక్షేమం కోరే వారైతే 17 శ్మశానాల్లోని కాటికాపర్లను మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిగా గుర్తించి, వారికి నెలవారీ వేతన పద్ధతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశానాల్లో అనేక సమస్యలున్నాయని, తాగునీరు, షెడ్లు, టాయిలెట్లు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. నగరంలో తక్షణమే విద్యుత్ శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికల్లో ఫీజు వసూలు సమస్యను కొన్ని మతతత్వ శక్తులు ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. దీనికి అధికార వైసిపి బాధ్యత వహించాలన్నారు. ఏలూరు కార్పొరేషన్‌లో శ్మశాన వాటికల్లో రూ.ఐదు వేలు వసూలు చేయాలనే తీర్మానాన్ని రద్దు చేయాలని, కాటికాపర్లను మున్సిపల్ సిబ్బందిగా గుర్తించాలని, విద్యుత్ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరుతూ సమావేశ అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో నేతలు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్, జనసేన నాయకులు పవన్‌కుమార్ కిషోర్, శ్రావణ్ నాగేశ్వరరావు, ఐఎఫ్‌టియు నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నేతలు



మాట్లాడుతున్న ఎడిఇ గోపాలకృష్ణ

విద్యుత్ ఆదాకు సహకరించాలి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యుత్ ఆదా మిగులు విద్యుత్ పెరగడానికి సహకరిస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ విద్యుత్ ఆదాకు సహకరించాలని, వృధాగా విద్యుత్ వినియోగాన్ని అరికట్టాలని ట్రాన్స్‌కో (ఎపిఇపిడిసిఎల్) భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ కోరారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా భీమడోలు ఎడిఎ కార్యాలయ పరిధిలో మండలంలో వారం రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం బుర్రకథ కళాకారులచే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ పొదుపు చర్యలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా కరెంటు పొదుపు వల్ల కలిగే లాభాలు, ప్రకృతిపరంగా తయారయ్యే విద్యుత్ వినియోగం తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వినియోగదారులు స్టార్ రేటింగ్ పరికరాలు వాడాలని సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన, ముగ్గులు పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు ఏలూరులోనే విద్యుత్ సౌదాలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో భీమడోలు ఎఇ రామస్వామి, ఎం.నాగులపల్లి ఎఇ రాజ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, బాలు పాల్గొన్నారు.

ఐఐఐటిలో షార్ట్ టర్మ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు

స్థానిక ఐఐఐటి (రాజీవ్‌గాంధీ సాంకేతిక విశ్వవిద్యాలయం)లో సివిల్ డిపార్టుమెంట్ సారథ్యంలో షార్ట్‌టర్మ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించామని ఐఐఐటి డైరెక్టర్ జివిఆర్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమం రెండు రోజులపాటు కొనసాగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి రీసెర్చ్ ఫెలోషిప్ స్కాలర్, ఐఐటి ఖరగ్‌పూర్‌కు చెందిన పి.సంధ్యారాణి మాట్లాడుతూ కంకర కొరత కారణంగా రోడ్ల నిర్మాణంలో చాలా సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఐఐటి పేవ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి రోడ్లు మన్నికగా నిర్మించేలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రీసైక్లింగ్ ప్రక్రియ ద్వారా వ్యర్థ పదార్థాలను కంకరకు బదులుగా మార్చడం వంటి ఆధునిక పద్ధతులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎస్‌వి.గోపాలరాజు, పరిపాలనా అధికారి ప్రదీప్‌కుమార్, డీన్ అకడమిక్ లక్ష్మణ్‌రావు, హెచ్ఒడి బి.శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ, నూజివీడు, శ్రీకాకుళం విద్యార్థులు 120 మంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఉంగుటూరు నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని అన్నారు 21న జరిగే రక్తదాన శిబిరాన్ని పార్టీ కార్యకర్తలు నాయకులు విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు



ఏలూరులో పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

సిఐటియు రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు: సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా జనవరి 2న భీమవరంలో ప్రదర్శన, బహిరంగసభలను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సిఐటియు 16వ మహాసభ మొట్టమొదటిసారిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జరుగుతుందన్నారు. ఈ మహాసభలో రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కార్మిక సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని వాగ్దానం చేసి మాట తప్పారన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని ఇచ్చిన హామీ అమలు చేయకుండా దాటవేత వైఖరి అవలంభిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఐవి.సుధాకర్, పి.భారతి, కె.విజయలక్ష్మి, నగర అధ్యక్ష కార్యదర్శులు బి. జగన్నాథం, వి.సాయిబాబు, నేతలు సుజాత, హైమావతి పాల్గొన్నారు.

ముసునూరు: భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ముసునూరులో మహాసభ వాల్‌పోస్టర్‌ను సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి కోడవలి శ్రీనివాసరావు, నేతలు పిల్లి మురళీ, కంచర్ల దుర్గారావు, కంచర్ల పోతురాజు, కంచర్ల శ్రీను, కొల్లి శ్రీను, కె.శ్రీను, పి.ఏడుకొండలు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న సుప్రజ

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుప్రజ

ప్రజాశక్తి - ఏలూరు

అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్.సుప్రజ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అల్లూరు సత్యనారాయణ భవనంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం పి.సుజాత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సుప్రజ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ వేతనాలు మాత్రం పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతుంటే చాలీచాలని వేతనాలతో జీవించాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు మెటీరియల్ సక్రమంగా సరఫరా చేయకుండా అధికారులు తనిఖీల పేరుతో వేధించడం మానుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల మెరుగుకు ప్రభుత్వాలు నిధుల కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి అంగన్వాడీలపైకి ఆ నెపాన్ని మోపుతుందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీ సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సెంటర్ అద్దెలు, బిల్లుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి, పి.హైమావతి, పుష్ప, మాణిక్యం, సరోజిని, విమల, తులసి, విజిత, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

కుక్కునూరు: పాలు, గుడ్లు, బాలామృతం అంగన్వాడీ కేంద్రాల్లోనే దించాలని, 2018 నుండి ఇప్పటి వరకూ ఉన్న పెండింగ్ బిల్లులు మొత్తం విడుదల చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అంగన్వాడీ ప్రాజెక్టు సమావేశానికి వచ్చిన సిడిపిఒ తులసికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ మండలంలో నాయికలగూడెం, బందారిగూడెం, గుట్టపుతొగు, కొత్తూరు, కౌండిన్యముక్తి గ్రామాలకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాల్లో స్టాక్ దించకుండా మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంటర్లో దించుతున్నారని, దీనివల్ల అంగన్వాడీలకు రూ.15 వందల వరకూ రవాణా ఛార్జీల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, అంగన్వాడీలు ఆర్.వి.రమణ, బాడిస సుజాత, కణితి మంగ, కారం రాధ, వర్స మంగ, మాధవి, రమాదేవి పాల్గొన్నారు.

విఎస్ఎస్‌లో కొత్త ప్లాంటేషన్లకు అనుమతివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

వన సంరక్షణ సమితులకు కొత్త ప్లాంటేషన్లకు అనుమతులు ఇవ్వాలని, కటింగ్‌కు వచ్చిన ప్లాంటేషన్లకు కటింగ్ ఆర్డర్ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వన సంరక్షణ సమితుల సమస్యలు పరిష్కరించాలి, కొత్త ప్లాంటేషన్లకు అవకాశం కల్పించాలని, కటింగ్‌కు వచ్చిన ప్లాంటేషన్లకు ఆర్డర్లు ఇవ్వాలని కోరుతూ జిల్లా అటవీశాఖ కార్యాలయం వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వన సంరక్షణ సమితులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో తునికాకు వేతన బకాయిలు అందక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో నిర్వాసితుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. విఎస్ఎస్‌లకు గత పది సంవత్సరాల నుండి కటింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో అవి పెద్ద మానవులుగా మారిపోయాయని తెలిపారు. గతంలో మండలస్థాయి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఉంగుటూరు, లింగపాలెం, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల్లో విఎస్-ఎస్‌లు కటింగ్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉండగా నేటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటేషన్ల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి విఎస్ఎస్‌ల సమస్యలు పరిష్కరించేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విఎస్ఎస్‌లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మండల అటవీశాఖ అధికారులపై జిల్లా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలు, పేదలు, దళితులను ఇబ్బందులు పెడుతున్న కిందిస్థాయి అధికారులపై చర్యలు కరువయ్యాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు వీటిపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అటవీ శాఖాధికారుల వ్యవహార శైలి మారాలని, పేదలకు ఉపయోగపడేలా ఉండాలని కోరారు. మండలస్థాయిలో రాజకీయ నాయకులతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఈ అవినీతి, అక్రమాలను అడ్డుకట్ట వేయాలని, ఉన్నతస్థాయి అధికారులు పక్షపాతం లేకుండా దర్యాప్తు చేయాలని కోరారు. ధర్నాకు సంఘం జిల్లా నాయకులు తుమ్మల సత్యనారాయణ, డి.దాసు నాయకత్వం వహించగా విఎస్ఎస్‌ల సభ్యులు చిన్న అంజయ్య, బాబూరావు, జయరాజు, సంతోషం, సుశీల పాల్గొన్నారు.



నినదిస్తున్న విఎస్ఎస్ సభ్యులు

కూలిరేట్లపై జిఒ విడుదల కోరుతూ హమాలీల ఆందోళన

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర ప్రభుత్వం గత జనవరిలో హమాలీల కూలి రేట్లు పెంచుతూ ఒప్పందం చేసుకుందని, ఇప్పటికి 11 నెలలైనా ఆ మేరకు జిఒ విడుదల చేయకపోవడం సరికాదని మండల సివిల్ సప్లయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు రాంబాబు విమర్శించారు. స్థానికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మండల స్థాయి గోదాము వద్ద హమాలీలు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ పెండింగులో ఉన్న ఇఎస్ఐ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. యూనిఫారం ఇవ్వాలని పిఎఫ్ అమలు చేయడంతోపాటు కొత్తవారిని యూనియన్‌లో సభ్యులుగా చేర్చుకునేందుకు అనుమతించాలని కోరారు. సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జట్టు మేస్త్రీ నాగేశ్వరరావు, త్రిమూర్తులు, గడ్డి సూర్యారావు పాల్గొన్నారు.



నినదిస్తున్న హమాలీలు

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రయివేట్ కళాశాల వాహనాలకు అడ్డంగా బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ విద్యార్థుల నుంచి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేసి ఒక బస్సులోనే పరిమితికి మించి విద్యార్థులను పంపిస్తున్నారన్నారు. బస్సులో క్లీనర్ లేడని, వాహనాలు నడిపే వారికి కనీసం అనుభవం లేదని చెప్పారు. దీనిపై ఆర్‌టిఒ కార్యాలయంలో ఎఒ ధనలక్ష్మికి వినతిపత్రం అందించి నెల రోజులవుతున్నా చర్యలు తీసుకోలేదన్నారు. ఎస్ఎఫ్ఐ ఏలూరు పట్టణ కార్యదర్శి ఎల్.రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడా బస్సులు కేటాయించాలని డిమాండ్ చేశారు.


గోనెసంచులు ఇవ్వాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - చింతలపూడి

తమకు గోనెసంచులు ఇవ్వాలని మండలంలోని పోతునూరు, మల్లయ్యగూడేనికి చెందిన రైతులు సోమవారం రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోనె సంచుల కోసం తిప్పలు పడుతున్నామని, ఆర్‌బికెల చుట్టూ తిరుగుతున్నామని చెప్పారు. గోనె సంచులు ఇచ్చేవరకు ధార్నా విరమించేదిలేదన్నారు. దీంతో తహశీల్దార్ కృష్ణజ్యోతి రైతులతో మాట్లాడారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సంచులు ఇస్తామని హామి ఇవ్వటంతో రైతులు ఆందోళన విరమించారు.

మాజీ సర్పంచి ఆదిలక్ష్మి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఆదిలక్ష్మి (ఫైల్‌ఫొటో)

జంగారెడ్డిగూడెం మాజీ సర్పంచి చీమకుర్తి ఆదిలక్ష్మి మృతికి పలువురు పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆదిలక్ష్మి సోమవారం ఉదయం మృతి చెందారు. జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు ఆమె చేసిన సేవ, కృషి పట్టణ అభివృద్ధికి దోహద పడ్డాయని స్థానిక రాజకీయ నాయకులు కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు పట్టణ ప్రముఖులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాల్య వివాహాలు చేయొద్దు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని జల్లికొమ్మర గ్రామంలో బాల్య వివాహాన్ని రెవెన్యూ, ఐసిడిఎస్ అధికారులు ఆపివేశారని గ్రామ మహిళా పోలీస్ కొర్లే పర్ల శ్రీలక్ష్మి తెలిపారు. జల్లికొమ్మర గ్రామానికి చెందిన పోతురాజు లలికుమారిల కుమార్తెకు బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమచారం అందుకున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తులసి, చంద్రావతి, గణపవరం ఆర్ఐ వెంకటేశ్వరరావు, విఆర్ఒ ప్రసాద్ జల్లికొమ్మర వెళ్లి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలు చేయొద్దని 18 ఏళ్లు నిండిన తర్వాత వివాహం చేయాలని తల్లిదండ్రులకు సూచించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఐ చంటిబాబు, పాస్టర్లు

ఘనంగా గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ప్రేమతత్వమే క్రీస్తు మార్గమని ప్రతి ఒక్కరూ తోటి వారితో ప్రేమానురాగాలతో మెల గాలని రెవ డి.జోజి క్రీస్తురాజు అన్నారు. మండల పరిధిలోని కనసానపల్లిలోని పరిశుద్ధ పౌల్ సిఎస్ఐ చర్చిలో ఆదివారం రాత్రి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు క్రీస్తు సందేశాన్ని అందించి, క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు రెవ డాక్టర్ కెఎల్.రిచర్డ్‌సన్, పాస్టర్లు సిహెచ్.శశిధర్, కె.ఐజక్ జాన్, కొల్లూరి మార్క్, సంఘస్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనకు పెన్షన్ రావడంలేదని గ్రామానికి చెందిన వృద్ధురాలు యాగంటి సత్తెమ్మ ఎంఎల్ఎ వద్ద వాపోయింది. దీంతో స్పందించిన ఎంఎల్ఎ వచ్చే నెల నుంచి ఆమెకు పింఛన్ అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చాట్రాయి : మండలంలోని కృష్ణారావుపాలెంలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని అల్లూరు గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు

మండలంలోని జంగంగూడెంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్వామివారికి రూ.రెండు లక్షలతో చేయించిన వెండి కిరీటం, హుండీ బద్దలు కొట్టి సుమారు రూ.లక్ష నగదు చోరీ చేసినట్లు నిర్వాహకులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానిక వైసిపి యువనేత పొట్లూరి అశోక్ తెలిపారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద జాతీయ రహదారిపై ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 130 క్వింటాల రేషన్‌బియ్యాన్ని పట్టుకున్నారు. లారీని స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించగా సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ రేషన్ బియ్యాన్ని, రూ.5.95 లక్షల సొత్తును స్వాధీనం చేసుకుని, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు సారా విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు

ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో ఎస్ఇబి అధికారులు సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి నూజివీడు ఎస్ఐ టి.గోపాలకృష్ణ తెలిపారు. వారి ముగ్గురిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.


హర్యానా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

హర్యానా రాష్ట్రం నుంచి ఆర్‌టిసి బస్సులో ఆంధ్రాకు తరలిస్తున్న మద్యం సీసాలను మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద ఎస్ఇబి అధికారులు సోమవారం పట్టుకున్నారు. వివరాల ప్రకారం... ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆర్‌టిసి బస్సులో ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్న నాలుగు ఫుల్ బాటిళ్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

దేశాభివృద్ధికి యువ ఇంజినీర్లు అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న సివిల్ ఇంజినీర్ తేజవెంకటనారాయణ

దేశ ప్రగతికి ఉపయోగపడేలా నేటి తరం ఇంజినీరింగ్ టీచింగ్ లెర్నింగ్ మెథడాలజీ మారాలని, అది పారిశ్రామికంగా ఉపయోగపడాలని, దేశాభివృద్ధికి దోహదపడాలని ప్రముఖ సివిల్ ఇంజినీర్ తేజవెంకటనారాయణ అన్నారు. ఈ నెల 16వ తేదీన చెన్నయ్ నగరంలో 37వ ఇండియన్ ఇంజినీరింగ్ కాంగ్రెస్, తమిళనాడు స్టేట్ సెంటర్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ద్వారా నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన రీసెర్చ్ పేపర్ ప్రెసెంటేషన్‌లో మాట్లాడారు. ఈ ప్రెసెంటేషన్‌లో తేజ చెప్పిన అభిప్రాయాలతో నిర్వాహకులు, కాన్ఫరెన్స్ ప్రతినిధులు అంగీకరించారు. దేశాభివృద్ధికి ఆచరణాత్మక ఇంజినీర్ తేజ వంటి యువ ఇంజినీర్ల ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని జంగారెడ్డిగూడెం డిఎల్‌డిఒ ఎం.రాజు సూచించారు. మండలంలోని బొర్రంపాలెం సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి సిబ్బంది పనితీరు పరిశీలించారు. అనంతరం తమ ఇళ్లకు వెళ్ళే దారిని కొందరు ఆక్రమించుకున్నారని ఇటీవల స్థానికులు స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి దారికి సంబంధించిన పత్రాలతో ఈ నెల 22వ తేదీన సచివాలయానికి రావాలని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ నగేష్, ఎంపిడిఒ ఎన్.తిరుపతిస్వామి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ కృష్ణ పాల్గొన్నారు.


గడువులోగా 'స్పందన' అర్జీలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు

స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో అర్జీల స్వీకరణ కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్‌లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి ఫొటోలతో అప్ లోడ్ చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామనిసోషల్ మీడియా మాధ్యమాల ద్వారా చెప్పే సైబర్ నేరగాళ్ల మాయలో పడి మోసపోవద్దని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వరకట్నం వేధింపులు, సరిహద్దుల విషయంలో గొడవలు, సివిల్ వివాదలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.




మాట్లాడుతున్న ఎస్‌పి

చింతలపూడి : స్పందనలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. పట్టణంలో జూనియర్ కళాశాల వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

ఆపద మిత్రలకు పలు అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు



మాట్లాడుతున్న జి.ప్రసంగిరాజు

ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపద మిత్ర వ్యవస్థను ప్రవేశపెట్టిందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చే మేనేజర్ జి.ప్రసంగిరాజు తెలిపారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో ఆరు మండలాలకు చెందిన ఆపద మిత్రలకు గత 12 రోజులుగా నిర్వహించిన అవగాహనా కార్యక్రమాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ఇడబ్ల్యూఎస్ఇడబ్ల్యూ 500 మంది ఆపద మిత్ర వాలంటీర్లకు వివిధ అంశాల్లో 17 శాఖల బాధ్యులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. ఆపదమిత్ర వాలంటీర్లకు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చే కార్యక్రమంలో భాగంగా వారు మండలంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా భీమడోలు సమీపంలోని ఏలూరు కాలువ వద్ద నీట మునిగిన వారిని రక్షించటం, వారికి ధైర్యాన్ని కల్పించటం, అవసరం మేరకు ప్రథమ చికిత్స అందించడంతో పాటు వారిని చికిత్స కోసం సమీపంలో ఉన్న వైద్యశాలకు తరలించే విషయమై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి అదనంగా రెండో అంశంలో భాగంగా కొల్లేరులంక గ్రామమైన లక్ష్మీపురంలో తరచూ చోటు చేసుకునే అవకాశం కల తుపాను, వరద, కరువు వంటి అంశాలను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శిక్షణ మేనేజర్‌గా వ్యవహరించిన జి.ప్రసంగిరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమంలో భాగంగా గత 12 రోజులుగా 17 శాఖల ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం వారికి పలు అంశాలపై క్షేత్రస్థాయిలో శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ దళం ప్రాజెక్ట్ మేనేజర్, అగ్నిమాపక సేవల జిల్లా అధికారి సిహెచ్.రత్నబాబు, ఎపి స్పెషల్ పోలీస్ ఎఎస్ఐ ఎన్.చాంద్‌కుమార్, గణపవరం పంచాయతీ విస్తరణ అధికారి పివి.సత్యనారాయణ, భీమడోలు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ తో పాటు ఆపదమిత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ప్రకారం పామాయిల్ మొక్కలు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

డిసెంబర్ 26వ తేదీ లోపు ప్రాధాన్యత ప్రకారం పామాయిల్ మొక్కలు పంపిణీ చేయకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని సిపిఐ సీనియర్ నాయకులు, పామాయిల్ రైతు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. ఈ మేరకు పట్టణంలో జూనియర్ కాలేజీ వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ రాజేంద్రన్‌ని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వసంవరావు మాట్లాడుతూ నవంబర్ 14వ తేదీన తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించగా పామాయిల్ రైతులు, కంపెనీ వారు, ఆర్టికల్చర్ అధికారులు తహశీల్దార్ సమక్షంలో సమావేశంలో నిర్వహించాలని చెప్పారన్నారు. డిసెంబర్ ఐదో తేదీన సమావేశం నిర్వహించి రైతు భరోసా కేంద్రాల్లో పర్మిట్లు ఇచ్చిన రైతులతో డబ్బులు కట్టించుకుని మొక్కలు పంపిణీ చేయాలని తీర్మానించారన్నారు. కంపెనీ ప్రతినిధులు అమలు చేయడంలేదన్నారు. వారం రోజుల్లో ప్రాధాన్యత ప్రకారం మొక్కలు పంపిణీ చేయకపోతే నిరవధిక నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతాంగం పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. చింతలపూడి ప్రాంతంలో అనేకమంది రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోలేదని, వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ క్రాప్ నమోదుకు అవకాశం ఇచ్చి గోనెసంచులు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పామాయిల్ రైతులు ఐక్యవేదిక కన్వీనర్ పుల్లూరు సోమశేఖర్, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ రాయాకుల లక్ష్మణరావు, చింతలపూడి మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె.కాలేశా, దొంత కృష్ణ సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, ఎఐటియుసి ఏరియా అధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు, రైతు సంఘం నాయకులు ఎస్‌కె.జాని, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.



సింగరాయపాలెం గ్రామస్తులను పరీక్షిస్తున్న వైద్యులు

సింగరాయపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో గురజ పిహెచ్‌సి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఇటీవల సీజనల్ జ్వరాలు అధికంగా ఉండడంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నారు. గ్రామం యావత్తు దోమల ఉధృతి పెరగకుండా నివారణ మందును పిచికారీ చేశామన్నారు. వీధులన్నీ బ్లీచింగ్ చల్లి, రోడ్లపై చెత్తాచెదారం లేకుండా రోజు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు సర్పంచి బోయిన విమల తెలిపారు. గ్రామంలోని అన్ని డ్రెయిన్లలో దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి పి.నాగలక్ష్మి, బోయిన రామరాజు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు

ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అధికంగా విద్యుత్ వినియోగించే పరిశ్రమలను సందర్శించి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం, జనరల్ మేనేజర్ పి.యేసుదాసు చెప్పారు. మండలంలోని మెసర్స్ ప్రవీణ్ స్పిన్నర్స్, రావిచర్లను ఆయన సోమవారం సందర్శించి విద్యుత్ ఆదాపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ రికార్డులను పరిశీలించారు. అన్ని ప్రధాన మోటార్లు, రింగ్ ఫ్రేమ్ కలిగిన సుక్షన్ మోటార్లకు ఇన్వర్టర్ డ్రైవ్‌లను అమర్చితే 30 శాతం విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఎల్ఇడి లైట్లను వినియోగించాలన్నారు. పలు అంశాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ యువరాం కిషోర్, ఫ్యాక్టరీ ప్రతినిధులు కె.మోహన్‌బాబు, జనరల్ మేనేజర్ కె.సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

రైతులకు పట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నూజివీడు

గత 11 సంవత్సరాలుగా సుంకొల్లు గ్రామంలోని సుంకొల్లు కండ్రిక సంబంధించిన సాగు భూములకు ఇప్పటివరకు రద్దు చేసిన పట్టాలు గొడుగువారిగూడెం రైతులకు తిరిగి ఇవ్వాలని నూజివీడు నియోజకవర్గ కాపునాడు, కాపు సంక్షేమసేన అధ్యక్షులు ఏనుగులు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయ ఎఒకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గొడుగు వారి గూడెం వాసులు, సుంకోల్లు గ్రామ కండ్రిక రైతులతో పాటు జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, నూజివీడు నియోజకవర్గ కాపు సంక్షేమ సేన, కాపునాడు అధ్యక్షులు ఏనుగుల వెంకటేశ్వరరావు జనసేన నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో గోపన్నపాలెం వ్యాయామ కళాశాల ప్రథమం

ప్రజాశక్తి - ఉంగుటూరు



ప్రథమ స్థానంలో గోపన్నపాలెం కళాశాల జట్టు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం పరిధి అంతర, అనుబంధ కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు, యూనివర్శిటీ టీం సెలెక్షన్ పోటీలు నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం రాత్రి ముగిశాయి. గోపన్నపాలెం వ్యాయామ కళాశాల క్రీడాకారులు టోర్నమెంట్ విన్నర్‌గా నిలిచారు. రెండోరోజు లీగ్ పోటీల్లో గోపన్నపాలెం, నరసాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు కళాశాలలు తలపడ్డాయి. రెండు రోజులుగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో యూనివర్శిటీ టీమ్‌ను ఎంపిక చేశామని నిర్వాహకులు చెప్పారు. విజేతలకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు, మెరిట్ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమానికి కళాశాలల ఇన్‌ఛార్జి కొండా రవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఢిల్లీ స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ డి.బాలకృష్ణచౌదరి, మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు డి.సుధారాణి, టీం సెలెక్షన్ పరిశీలకులు సిహెచ్.రాజేశ్వరి, సిహెచ్.రాజు, కళాశాల పీడీ డాక్టర్ రాజామెరిసన్‌బాబు పాల్గొన్నారు.

అనంతబాబుకు బెయిల్ పిటీషన్ రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కెవిపిఎస్ నాయకులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని అత్యంత దుర్మార్గంగా హత్య చేసిన ఎంఎల్‌సి అనంతబాబును ఎంఎల్‌సి పదవి నుంచి తప్పించాలని, బెయిల్ పిటిషన్ రద్దు చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుట్టాయగూడెం కెవిపిఎస్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చాక దళితుల హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. దళితులను హత్య చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కొమ్ముకాస్తు ఊరేగింపులు చేసుకునేందుకు పర్మిషన్ ఇస్తుందని, ఇది పూర్తిగా దళిత వ్యతిరేక ప్రభుత్వమని ఫ్రాన్సిస్ విమర్శించారు. అనంతబాబు బెయిల్ పిటిషన్ రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ ఉద్యమం రాష్ట్ర, దేశవ్యాప్తంగా విస్తరించక ముందే అనంతబాబును ఎంఎల్‌సి పదవి నుంచి తప్పించాలన్నారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి వాస్తవాలను బయటకు తీసి ఎంఎల్‌సి అనంతబాబు బెయిల్ పిటిషన్ రద్దు చేయించి సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాజు, గొల్ల సురేష్, ఎ.కిషోర్, నాగేంద్ర, నాని, జి.చిన్ని పాల్గొన్నారు.

పలుచోట్ల సిఎం జగన్ పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు వారోత్సవాలను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్, వైఎస్ఆర్ క్రాంతి పథం శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సందేశాత్మక ముగ్గులతో పాటు నవరత్న పథకాలను, న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలు ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారితో పాటు, కన్సోలేషన్ బహుమతులు పొందిన మరో ముగ్గురికి, పోటీల్లో పాల్గొన్న అందరికీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు బహుమతులు అందించారు. ఎంపిపి గంజిమాల రామారావు, జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి రూ.15 వేల సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందించారు. అతిరాస కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపిడిఒ కెఆర్ఎస్.కృష్ణప్రసాద్, ఎపిఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు టి.రామలక్ష్మి, సరస్వతి, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నూజివీడు : నూజివీడు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, కో-ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసిపి నేతలు శీలం రాము, పల్లె రవీంద్రారెడ్డి, ఎంపిడిఒ జి.రాణి, ఉపాధి హామీ ఎపిఒ సోమేశ్వరి, పట్టణ ఎస్ఐ శివ నారాయణ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలోని పలు గ్రామాల్లో అయా గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నీతి వాక్యాలు చెప్పే అర్హత జనసేనకు లేదు : టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నగరంలో ప్రజా సమస్యలపై నిత్యం ప్రజా పోరాటాలు చేస్తున్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు నీతి వాక్యాలు చెప్పే స్థాయి, అర్హత జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడుకు లేవని మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం అన్నారు. స్థానిక పవర్‌పేటలోని టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్మశానవాటికల్లో మృతదేహాన్ని దహనం చేయాలంటే రూ.ఐదు వేలు చెల్లించాలని ఏలూరు కార్పొరేషన్ చేసిన తీర్మానాన్ని టిడిపి కార్పొరేటర్ కౌన్సిల్ భేటీలో వ్యతిరేకించారని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా టిడిపి ఇన్‌ఛార్జి, కార్పొరేటర్లపై జనసేన ఇన్‌ఛార్జి అనాలోచిత వ్యాఖ్యలు చేయటం ఆయన బేలతనాన్ని తేటతెల్లం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంప్రదాయాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు బాల్యం నుంచే తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని బొర్రంపాలెం సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం అమ్మ నీకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు.

మండపానికి రూ.13 లక్షల సాయం

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని కోరుకొల్లు శ్రీ సుబ్రహ్మన్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.16 లక్షలతో నిర్మించనున్న కళ్యాణ మండపంతో పాటు రెండు గదులకు శ్రీ వర్రే జగన్నాథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష కార్యదర్శులు చీకటి లక్ష్మణరావు, చెన్నంశెట్టి కృష్ణ శంకుస్థాపన చేశారు. కళ్యాణ మండపం నిర్మాణానికి ఎన్ఆర్ఐ వర్రే వెంకట సత్యనారాయణ రూ.13 లక్షల ఆర్థిక సాయం అందించారని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఆలయ కమిటీ ద్వారా మరో రూ.మూడు లక్షలతో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు చెప్పారు

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 18/2021
ఇన్
ఒ.ఎస్.నెం. 126/2006

బిట్వీన్ :
కానాల బాల వెంకట రమేష్ -డిహెచ్‌ఆర్
మరియు
జాలా మెర్సీ మాణిక్యం మరియు యితరులు -జెడిఆర్స్
టు
జాలా మెర్సీ మాణిక్యం
భర్త : యోసోబు,
డోరు నెం. 25-1-2/28,
పత్తేబాద, ఏలూరు

పై నెంబరు గ్రంథములో మీకు సి.పి.సి. ఆర్డరు-21, రూల్-22 ప్రకారం జారీ చేసిన నోటీసు అమలు కానందున కోర్టు వారు పత్రికాప్రకటన ద్వారా నోటీసు జారీ చేయమని ఉత్తర్వులు యిచ్చినారు. కావున పై నెంబరు గ్రంథములో మీకు ఆక్షేపణలు ఏమైనా యున్న యెడల ది.20-12-2022వ తేదీ ఉదయం గం.10.30ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా తెలియచేసుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున కోర్టు వారు పై గ్రంథమును తీర్మానించెదరు.

(టి.వి.విశ్వనాథం)
ఏలూరు, డిక్రీ హోల్డరు తరపు అడ్వకేట్, ఏలూరు
తేది : 19-12-2022

IN THE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM-Ist ADDITIONAL JUDICIAL MAGISTRATE OF 1ST CLASS : TADEPALLIGUDEM
O.S.No. 290/2022

Between:
Indian Bank, Rep. by its Branch Manager, Tadepalligudem.
...Petitioner
AND
1) Sri Pusarla Mehar Kumar
2) Sri Pusarla Swarna Madhuri
...Respondents

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు వారు ప్రతివాదులు ఇరువురికీ కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను సమన్లు పంపినప్పటికిని తీసుకోకుండా కాలయాపన చేస్తున్నందు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా మీకు తెలియజేయటం అయినది. కావున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.23-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియజేయవలెను.** లేని ఎడల సదరు పబ్లిక నోటీసు ద్వారా అమలు చేసినట్టి భావించి పై కోర్టు వారిచే తదుపరి చర్యలు తీసుకొనబడునని తెలియచేయడమైనది.

తోట రాంబాబు
అడ్వకేట్, విజయ టవర్స్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
15-12-22. సెల్: 98483 77437

ప్రకటన

నా క్లయింట్ పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం, హౌసింగ్ బోర్డు కాలనీ MIG 2 ఫ్లాట్ నెం 90 కాపురస్తులు, లేట్ పున్నాని సీతయ్య గారి కుమారుడు, పున్నాని ప్రసాద్ (Cell No: 91826 54564) నాకు ఇచ్చిన సంజాయిషీపై ఈ ప్రకటన జారీ చేయడమైనది. షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని నా క్లయింట్ స్వార్జితముగా తన భార్య అయిన పున్నాని పద్మజ పేరున కొనుగోలు చేయడమైనది. షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి నా క్లయింట్ స్వాధీన హక్కు భుక్తములో ఉండియున్నది. సదరు పున్నాని పద్మజ గారు ది.19-10-2019న అనారోగ్యముతో మరణించినారు. లేటు పున్నాని పద్మజ గారికి నా క్లయింట్ 1) పున్నాని ప్రసాద్ 2) పున్నాని శ్రీకాంత్ 3) పున్నాని సీత రామ్‌కుమార్ వారసులై వున్నారు. హిందూ వారసత్వ చట్ట రీత్యా షెడ్యూల్ దాఖలా ఆస్తి నా క్లయింట్‌ను, పున్నాని సీత రామకుమార్ లును "సమాన హక్కుదారులై వున్నారు. ఇటీవల సదరు పున్నాని శ్రీకాంత్, పున్నాని సీత రామకుమార్ లు నా క్లయింట్ చనిపోయినట్లుగా తప్పుడు దస్తావేజులు సృష్టించి షెడ్యూల్ దాఖలా ఆస్తిని అక్రమంగా వారి అనుచరులకు ఇతరులకు క్రాంతము చేసి ఆస్తిని కాజేయవలెనని దురుద్దేశ్యంలో ఉన్నట్లుగా నా క్లయింట్‌కి తెలిసినది. అటువంటి చర్యలు చెల్లవు. కనుక ఆవిధమైన చర్యలకు ఎవ్వరు సహకరించిన నష్టపోవుదురు, నా క్లయింట్ హక్కులకు ఏవిధమైన భంగము కలగదని ఈ ప్రకటన మూలంగా తెలియచేయడమైనది.

షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి: పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, భీమవరం సబ్.డి. లో చేరిన భీమవరం మున్సిపాలిటీ ఏరియాలోని పాత 3 కొత్త 4 ప్రస్తుతం 37 వార్డ్ భీమవరం గ్రామంలో నా క్లయిం సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తంలో గల గ్రౌండ్ రెంటుగా మారిన జి.మే ఆర్.ఎస్. నెం.180/2బి రు య 6-35 ట్లులో ఫ్లాట్‌ను 18లో 141.1/3 చ.గ.ల నకటవ ప్రతికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్ అ.26.6 అం, **దక్షిణం:** సంకా శ్రీకృష్ణమూర్తి గారిం గోడ స్థలం అ. 48-00అం., **పడమర:** ఫ్లాట్ నెం.17 రు. దవ్వే సూర్యనారాయణ గారి స్థలం ఆ 26.00 అం., **ఉత్తరం:** దిగువ రెండవ ప్రతి అ 18.00 ఆం .. ఈ హద్దుల మధ్య 141.1/3 చ.గ. లేక 118.17 చ.మీ స్థలమును, రెండవ ప్రతికి హద్దులు: **తూర్పు:** మున్సిపల్ రోడ్ ఆ.6.9 అం.. **దక్షిణం:** పై 1వ ప్రతిక అ. 48-00 ఆం., **పడమర:** ఫ్లాట్ నెం.17 రు. దవ్వే సూర్యనారాయణ గారి స్థలం ఆ.4.00 అం., **ఉత్తరం:** సంకా శ్రీ కృష్ణమూర్తి గారి స్థలం ఆ.48.00 అం..

ఈ హద్దులు మధ్య 28.2/3 చ.గ. లేక 23.7/8 చ.మీ స్థలమును వెరసి రెండు ప్రతులు తాలూకా 1700 చ.గ.లు లేక 141.2/3 చ.మీ. స్థలమును ఇందలి భీమవరం మున్సిపల్ అసెస్మెంట్ పాత 6874 కొత్త 1074008150 డోర్ నెం.3-11-11 రుగల ఆర్.సి.సి. మేడ (షాపింగ్ కాంప్లెక్స్) దానిని అంటి - వున్న యావత్తు కలప సామానులు ఇందలి హెచ్.ఎస్.సి. నెం.5158, 17768, 17772, 18271. 17769, 18603, 18105 ర్లు గల కరంట్లు సర్వీస్‌లు సహా, ఇందలి భీమవరం వాటర్ టాప్‌ల నెం 2357/1466రు గల వాటర్ టాప్ కనెక్షన్ సహా..

మోపాటి బాల పరమేశ్వరరావు, న్యాయవాది
భీమవరం సుంకర పెద్దయ్య గారి స్ట్రీట్,
17-12-2022 భీమవరం